ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 22 ఫిబ్రవరి 2024



ఎస్వీయూలో ర్యాలీ నిర్వహించిన విద్యార్థి సంఘాల నాయకులు

ఇది ప్రజాస్వామ్యంపై దాడి

- కొడాలి నోరు అదుపులో పెట్టుకోవాలి
- జర్నలిస్టులపై దాడులు చూస్తుంటే పాలకులే ప్రోత్సహిస్తున్నట్లుంది
- రోడ్లపైకొచ్చిన విద్యార్థి సంఘాలు, టీడీపీ శ్రేణులు
- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను విద్యార్థి సంఘాలు, టీడీపీ శ్రేణులు ఖండించాయి. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా నాయకులు అభివర్ణించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జిల్లాలో పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎస్వీయూలో విద్యార్థి సంఘాల ర్యాలీ, నిరసన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై పాశవికంగా దాడి చేసిన వైసీపీ రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండు చేసింది. తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీలో బుధవారం వివిధ విద్యార్థి సంఘాలు ఐక్యంగా విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం వర్సిటీ మెయిన్ గేట్ వద్దనున్న అంబేడ్కర్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టాయి. టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, టీఎస్ఎఫ్, జనసేన విద్యార్థి సంఘం, నవ సమాజ గిరిజన విద్యార్థి ఫెడరేషన్ తదితర సంఘాలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొడాలి నాని జర్నలిస్టుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో నిత్యం జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రజల గొంతుకగా పనిచేసే పత్రికల స్వేచ్ఛకు భంగం కల్గుతోందన్నారు. దాడులను అరికట్టాల్సిన పాలకులే ప్రోత్సహిస్తున్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే శ్రీకృష్ణపై దాడి జరిగి మూడ్రోజులైనా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పత్రికలు, జర్నలిస్టుల గొంతు నొక్కినా అంతిమంగా ప్రజల గొంతు నొక్కినట్టేనని అభిప్రాయపడ్డారు. ఇసుక అక్రమ రవాణపై వార్త రాసిన ఓ జర్నలిస్టుపై అమరావతిలోనూ, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్‌పైన, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పైన దాడి చేయడం దుర్మార్గమని చెప్పారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేవీబీపురంలో కళ్లకు గంతలు కట్టుకుని టీడీపీ నిరసన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తే పతనం తప్పదు

సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్

కేవీబీపురం ఫిబ్రవరి 21: పత్రికా స్వేచ్ఛపై దాడి చేసిన వారికి పతనం తప్పదని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని నిరసిస్తూ బుధవారం మండలంలోని విలేకర్లతో కలిసి ఆమె, టీడీపీ నాయకులు కళ్లకు నల్లవస్త్రం ధరించి స్థానిక సాయిబాబా గుడి ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీసీ సెల్ నాయకుడు మునిస్వామి యాదవ్, రాజా రెడ్డి, లోకేష్ నాయుడు, వెంకటకృష్ణయ్య, మునికృష్ణయ్య, బాల, సురేష్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి



ఏర్పేడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతల నిరసన

ఏర్పేడు, ఫిబ్రవరి 21: సీఎం జగన్, ఆయన అనుచరుల్ని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చేసిన దాడిని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. 2004లో వైఎస్ ముఖ్యమంత్రి అయ్యాక ఇదే తరహాలో పత్రికా స్వేచ్ఛను హరింపజేయడానికి ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అదే క్రమంలో ప్రస్తుతం జగన్ కూడా తాను చేస్తున్న తప్పులను బయటపెడుతున్న ఆంధ్రజ్యోతిపై తరచూ విరుచుకుపడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణవేణి, గుణయాదవ్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, భాస్కర్‌నాయుడు, నరసింహులుయాదవ్, శివశంకర్‌రెడ్డి, నిరంజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దాడులు

- గవర్నర్, హైకోర్టు స్పందించి విచారణ చేపట్టాలి: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: 'ఓ పథకం ప్రకారం రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడి జరుగుతోంది. ఈ విషయంలో రాష్ట్ర గవర్నర్, హైకోర్టు స్పందించి.. విచారణ చేపట్టాలి' అని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో జర్నలిస్టులు విధులు నిర్వహించాలన్నా భయపడేలా వైసీపీ కార్యకర్తలను ఉసిగొల్పి దాడులు చేయించి, సోషల్ మీడియాలో వైరల్ చేయిస్తున్నారని చెప్పారు. ఇలా చేస్తే జర్నలిస్టులు భయపడతారనేది వారి అవివేకమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులను సైతం లోబరచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసి.. దొంగ ఓట్లతో గెలవాలన్న ఆలోచనతో వాస్తవాలు బయట పెట్టకూడదని మీడియాను టార్గెట్ చేశారని అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేకుండా పోయిందన్నారు. వెంటనే కేంద్ర బలగాలతో రాష్ట్రంలో పర్యవేక్షణ చేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వైసీపీ పాలనను ప్రజలు ఛీకొట్టారని, ఓటమి భయంతో ముఖ్యమంత్రి ఏం చేస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ, జనసేన కూటమిదే విజయం అని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఆర్సీ మునికృష్ణ, ఊకా విజయకుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడి చేసిన వ్యక్తులపై పీడీ యాక్టు నమోదు చేయాలని, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని.. ఎపుడు ఎన్నికలొచ్చినా బటన్ నొక్కి జగన్‌ను ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్, మనోహర్ ఆచారి, సుధాకర్‌రెడ్డి, నాగప్రతాప్, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే

మీ ముందుకు వచ్చాం





శాంతిపురంలో మహిళల ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

- ప్రభుత్వ అరాచకాలనుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాం
- 'ఆడబిడ్డలకు ఆర్థిక స్వేచ్ఛ' ముఖాముఖిలో నారా భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 21: 'నా ఫ్రెండు ఒకరు చెప్పారు, బయట తిరగొద్దని. ఈ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని, ఎంతకైనా తెగిస్తుందని భయపెట్టారు. కానీ, నా బిడ్డలున్నారన్న నమ్మకంతోనే నాతో సహా చంద్రబాబు, లోకేశ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నాం. ఈ ప్రభుత్వ అరాచకాల నుంచి రాష్ట్రాన్ని, మిమ్మల్ని కాపాడుకోవడానికి అహర్నిశలు ప్రయత్నిస్తున్నాం' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వ్యాఖ్యానించారు. 'నిజం గెలవాలి' కార్యక్రమ పర్యటనలో భాగంగా బుధవారం ఆమె శాంతిపురంలో 'ఆడబిడ్డలకు ఆర్థికస్వేచ్ఛ' అంశంపై మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. సరదా వ్యాఖ్యలూ చేశారు.



మమత, కర్లగుట్ట: చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు 53 రోజులపాటు మీరెలా గడిపారు? మీరు ఎదుర్కొన్న సమస్యలేమిటి?

భువనేశ్వరి: చంద్రబాబు అరెస్టు విషయంలో ఏమాత్రం భయపడలేదు. ఆయన చాలా ధైర్యంగా ఉన్నారు. ఆయన జైలుకు వెళ్లడంతో బాధపడిన, మనస్తాపంతో చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శించమన్నారు. ధైర్యం చెప్పమన్నారు. జైల్లో ఉండీ ఈయన ఏమిటి ప్రజల గురించి ఆలోచిస్తున్నారని నేను కొంత నిరాశ చెందిన మాట నిజం. కానీ ఆయన అక్రమ కేసులో నిర్బంధానికి గురైనప్పుడు మీరు పడిన బాధ, నిర్బంధాలు, పోలీసు ఆంక్షలకు వెరవకుండా చేసిన నిరసనలు చూసి నేను చాలా ప్రభావితురాలయ్యా. మీ కుటుంబాలను ఓదార్చి, భరోసా ఇవ్వడానికే ఈ పర్యటనలు పెట్టుకున్నా.



విజయలక్ష్మి, గుండిశెట్టిపల్లె: భోంచేసేటప్పుడు ఏ విషయాల గురించి ఎక్కువగా చర్చింకుంటారు?

భువనేశ్వరి: కనీసం భోజనం సమయంలోనైనా కుటుంబ విషయాలు మాట్లాడుదామంటే ఇటు తిరిగి, అటు తిరిగి చంద్రబాబు ప్రజలవద్దకే వస్తారు. లోకేశ్‌కన్నా షార్ప్‌గా ఆలోచిస్తారు. 2047 విజన్‌తో ముందుకెళుతున్న ఆయన్ను పట్టుకుని ఈ ప్రభుత్వం వయసైపోయింది అంటుంది. కానీ ఆయన ఇంకా యంగ్‌స్టర్. ఆయనలా ఆలోచిస్తున్నాడు కాబట్టే నేనిలా నిజం గెలవాలి కార్యక్రమంలో మీ ముందుకు వచ్చా. మీరు చూపిస్తున్న ప్రేమానురాగాలను ఎప్పటికీ మరవలేం.



కౌసల్య, కుప్పం: నృత్య తదితర కళలను మీరెలా ప్రోత్సహిస్తారు?

భువనేశ్వరి: నేను వెంకట చిన సత్యం దగ్గర కూచిపూడి, భరత నాట్యం 11 సంవత్సరాలు నేర్చుకున్నా. నాకు కళలంటే చాలా ఇష్టం. చంద్రబాబు కూడా అధికారంలో ఉన్నప్పుడు కళాకారులను ప్రోత్సహించారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత ప్రాధాన్యం ఇస్తారు.



జ్యోత్స్న, కొలమడుగు: గార్మెంట్స్‌లో పనికోసం మేము శాంతిపురంనుంచి కుప్పం వెళ్తున్నాం. ఇక్కడే మాకు పరిశ్రమలు తెస్తే బావుంటుంది.

భువనేశ్వరి: చంద్రబాబు అధికారంలో ఉండగా కుప్పంలో పరిశ్రమలు చాలా వచ్చాయి. ఈ ప్రభుత్వం వచ్చాక వచ్చిన పరిశ్రమలు కూడా వెనక్కి వెళ్లిపోయాయి. జిల్లాలో అమరరాజా, అనంతపురంలో జాకీ పరిశ్రమలు వెళ్లిపోయాయి. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం.



యువతేజశ్విని, పెద్దబొమ్మనపల్లె: కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేదలకు ఉచిత విద్య అందించాలి.

భువనేశ్వరి: నాకు కూడా ఇంత దాకా ఈ ఆలోచన రాలేదు. మంచి సలహా ఇచ్చావు. కచ్చితంగా మా మేనేజ్‌మెంట్‌తో ఆలోచన చేసి స్కూల్ ఏర్పాటు చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ త్వరలో ప్రారంభిస్తాం.

అంతు చిక్కని జ్వరం

- తిరుమూరులో 80 మందికి పైగా అనారోగ్యం

వాకాడు, ఫిబ్రవరి 21: ముందుగా జ్వరం వస్తుంది. ఉన్నట్టుండి కాళ్లు, చేతులు, ముఖం వాపు వచ్చేస్తుంది. నొప్పులూ తీవ్రంగా ఉంటున్నాయి. జ్వరం తగ్గినా నొప్పులు మాత్రం అలాగే ఉంటున్నాయి. ఇలా అంతుచిక్కని జ్వరంతో వాకాడు మండలంలోని తిరుమూరు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడినవారు 15 రోజులకు పైగా స్థానికంగా చికిత్స తీసుకున్నా.. తగ్గక పోవడంతో కోట, నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి బారిన పడిన వారిలో.. నక్కా జమున, తిరుమూరు రామచంద్రయ్య, వల్లూరు చంద్రమ్మ, ప్రసూన్న, తిరుమూరు వెంకటయ్య, పామంజి చెంగయ్య, నక్కా రామసుబ్బమ్మ, కుంచం శేషమ్మ, కుంచం ఆదిలక్ష్మమ్మ కుటుంబం, గడ్డం పరసారత్నం కుటుంబం, చుట్టా పుల్లయ్య కుటుంబం, చింతల మణి, కుంచం రమణమ్మ, పాముల నాగేశ్వరరావు కుటుంబం ఇలా.. 80మందికిపైగా తిరుమూరు హరిజనవాడ ప్రతి ఇంటిలోనూ బాధితులున్నారు. దీనిపై తిరుమూరు సచివాలయంలో సమాచారం ఇచ్చినా స్థానిక వైద్యాధికారులు ఎవరూ రాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై నిడిగుర్తి పీహెచ్‌సీ వైద్యుడు రామకృష్ణ వివరణ కోరగా.. సమాచారం ఎవరూ చెప్పలేదని, గ్రామంలో అవసరమైతే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

నొప్పులు తగ్గడం లేదు



ఐదు రోజుల కిందట తీవ్ర జ్వరం వచ్చింది. కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాను. ఆరోజు రాత్రికంతా జ్వరం తగ్గిపోయింది. అప్పటి నుంచి తట్టుకోలేని విధంగా నొప్పులు వస్తున్నాయి. ఎన్ని మాత్రలు మింగినా, ఇంజక్షన్లు వేయించుకున్నా నొప్పులు తగ్గడం లేదు.

- పామంజి చెంగయ్య, బాధితుడు

శరీరమంతా వాపులతో తట్టుకోలేకున్నా

ఎనిమిది రోజుల కిందట జ్వరం వస్తే కోటలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాను. జ్వరం తగ్గింది. అప్పటి నుంచి మొహం వాచి, కీళ్లు, మెడజీవాల నొప్పులతో ఇబ్బంది పడుతున్నా. నొప్పులు తగ్గక పోవడంతో మరో రెండు ఆస్పత్రులకు వెళ్లినా ఫలితం లేదు. శరీరం అంతా వాపులతో తట్టుకోలేక పోతున్నా.



- నక్కా జమున, బాధితురాలు

ఐఐటీలో నేడు స్నాతకోత్సవం

ఏర్పేడు, ఫిబ్రవరి 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో గురువారం 4, 5వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా వర్చువల్‌గా ఢిల్లీ నుంచి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు డిగ్రీలను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేయనున్నారు. ఈ స్నాతకోత్సవానికి హాజరు కావాలని తిరుపతి ఎంపీతో పాటు శ్రీకాళహస్తి, తిరుపతి ఎమ్మెల్యేలకు, కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్ తదితరులకు ఆహ్వాన పత్రికలను రెండ్రోజుల కిందటే పంపారు. మరో ముఖ్య అతిథిగా జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్ పాల్గొననున్నట్లు డైరెక్టర్ వివరించారు.



కార్పొరేషన్ అవినీతికి ఇదే సాక్ష్యం!



కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న చింతా మోహన్

- స్మార్ట్‌సిటీ నిధులతో హోటల్ నిర్మించారంటూ చింతామోహన్ ధర్నా

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి కపిలతీర్థం వద్ద హోటల్ నిర్మించడం ఏమిటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి హోటల్ ముందు ధర్నా చేశారు. హోటల్ నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతి నగరపాలక సంస్థలో అవినీతి రాజ్యమేలుతోందనడానికి ఇదే సాక్ష్యం అన్నారు. కాగా.. తిరుపతి జూపార్కును మరోచోటుకు తరలించి, ఆ ప్రాంతంలో ఐటీ హబ్ నిర్మించాలని కోరారు. నిరుద్యోగ సమస్య శాశ్వత పరిష్కారానికి ఇది మార్గమని చెప్పారు. జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిటీ అధ్యక్షుడు గోపిగౌడ్, తిరుపతి జిల్లా లీగల్ అధ్యక్షుడు రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తేజోవతి, ఓబీసీ జిల్లా అధ్యక్షురాలు శాంతియాదవ్, సేవాదళ్ అధ్యక్షురాలు మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.





కూలిన వంతెనకు మూడో వార్షికోత్సవం

- ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ వినూత్న నిరసన

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 21: డప్పుల మోత హోరెత్తింది. టపాసులు పేలాయి. భారీ పూలమాలతో ఊరేగింపు తిరుపతి రూరల్ మండలం చిగురువాడ సమీపంలోని కూలిన వంతెన వద్దకు చేరుకుంది. జాతర సంబరాన్ని తలపించిన ఈ దృశ్యం చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కుప్పకూలిందని చాటిచెప్పేందుకు ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమం. కూలిన వంతెనకు పూలమాల వేసి, మూడో వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. చంద్రగిరి నియోజకవర్గంలో వానల ధాటికి మూడేళ్ల కింద ఐదు బ్రిడ్జిలు కూలిపోయాయని, వాటి అతీగతీ పట్టించుకునే వారే లేరని సుధాయాదవ్ ఆరోపించారు. తాయిలాలపై తాటికాయంత అక్షరాలతో పేర్లు వేసుకొని పంచేందుకు ఉన్న డబ్బులు, అభివృద్ధి పనులకు మాత్రం ఖర్చు చేయరా? అని నిలదీశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిలో చలనం లేనందున, ఆయనకు కనువిప్పు కలగాలనే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.



పల్స్‌పోలియో చుక్కల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

3న పల్స్‌పోలియో

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: వచ్చేనెల మూడో తేదీన చేపట్టనున్న పల్స్‌పోలియో కార్యక్రమంలో జిల్లాలో 0-5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2,53,282 మంది పిల్లల కోసం 3,36,860 డోసులు వచ్చాయన్నారు. 1,824 పల్స్‌పోలియో కేంద్రాలు, 83 మొబైల్ వాహనాలు, 185 రూట్లు, 59 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7,774 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి రోజు వేసుకోని పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వేయాలని డీఎంహెచ్‌వో శ్రీహరిని ఆదేశించారు. అనంతరం పల్స్‌పోలియోకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డీఈవో శేఖర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి, డీఐవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 21: తిరుపతి రూరల్ మండలంలోని సి.మల్లవరం, పెరుమాళ్‌పల్లె, గొల్లపల్లె, దుర్గసముద్రం గ్రామాల్లో తుడ అధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం పర్యటించారు. మల్లవరంలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.25 లక్షలతో ఆరోగ్య కేంద్రం, రూ.22 లక్షలతో మీటింగ్ హాల్, పెరుమాళ్‌పల్లెలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, గొల్లపల్లెలో సచివాలయం, ఆర్బీకే కేంద్రాన్ని మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో రమేష్‌బాబు, వైసీపీ నాయకులు మునీశ్వరరెడ్డి, మొక్కల తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి మోహిత్ రెడ్డి బుధవారం భూమి పూజ నిర్వహించారు. జడ్పీ మాజీ ఛైర్మన్ వలసారెడ్డిగారి సిద్దరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివప్రసాద్‌రెడ్డి ఈ తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ.2కోట్ల విరాళం అందజేస్తున్నారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, జడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మనోహర, ప్రిన్సిపాల్ విశ్వనాథ నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21: మండలంలోని అనుపల్లె పంచాయతీ గడ్డకిందపల్లెలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఘటం ఇంటింటా పూజలందుకుంది. బుధవారం వేకువ జామున చెంతాళ్ల గంగమ్మ అమ్మవారి ప్రతిమను మట్టితో తయారు చేసి అలంకరించి, నడివీధి గంగమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం గ్రామబలి ఉత్కంఠ భరితంగా సాగింది.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత
హనుమంతుడి విహారం



చంద్రగిరి, ఫిబ్రవరి 21: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠించగా మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో ఉదయం 11 గంటలకు సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లను ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈనెల 29 నుంచి మార్చి 8వ తేది వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ.



మండపంపల్లెలో నడివీధి గంగమ్మ జాతర

చంద్రగిరి, ఫిబ్రవరి 21: చంద్రగిరి మండలం మండపంపల్లెలో నడివీధి గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నడివీధి గంగమ్మ ప్రతిమను మట్టితో తయారుచేసి విశేషంగా అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి, మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కటి ఆరోగ్యం



శాస్త్రవేత్త హేమంత్‌కుమార్‌కు సన్మానం

చంద్రగిరి, ఫిబ్రవరి 21: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు తీసుకొంటే ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రిటైర్డు శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్ అన్నారు. ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, వాతావరణ వైపరీత్యాలు, మానవ ఆరోగ్యం, పోషణపై అవగాహన సదస్సు జరిగింది. ఈకార్యక్రమంలో వీసీ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారధి, ప్రొఫెసర్లు ఈశ్వర్, శ్రీనివాసులు, గిరిధరకృష్ణ, సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకుందాం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా

పాకాల, ఫిబ్రవరి 21: మాతృభాష తెలుగును పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా అన్నారు. కళాశాలలో బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరబాబు మాట్లాడుతూ మాతృభాషలో మంచి ప్రావీణ్యం ఉంటేనే ఇతర భాషలను సులభంగా నేర్చుకోవచ్చన్నారు. మాతృభాషలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు మాశిలామణి, మోహన్ బెహరా, మాదవీ, ఆదిశేఖర్ రెడ్డి, రమణమ్మ, రవి, విష్ణుప్రియ, లక్ష్మీప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

మామిడిలో తేలికపాటి నీటి తడులివ్వండి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 21: మామిడితోటలకు తేలికపాటి నీటితడులివ్వాలని ఉద్యాన శాఖాధికారి జి.సునీల్ అన్నారు. మిట్టకండ్రిగలో మామిడితోటలను బుధవారం ఆయన సందర్శించి, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రామచంద్రాపురం మండలంలో దాదాపు 4వేల ఎకరాల్లో మామిడి సాగులో ఉన్నా కేవలం 25 నుంచి 30శాతం తోటల్లో మాత్రమే పూత వచ్చిందన్నారు. తేలికపాటి నీటి తడులిస్తే మొగ్గలు విచ్చుకుని పూత లేదా ఇగురు ఏదో ఒకటి వస్తుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రం అధికారులు డిల్లీరాణి, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

పాకాల: దామలచెరువు, గోర్పాడు, మొగరాల గ్రామాల పరిసరాల్లోని మామిడి తోటలను ఆర్బీకే సిబ్బందితో కలిసి ఉద్యాన అధికారి ఎస్.శైలజ బుధవారం పరిశీలించారు. అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో ఎక్కువ శాతం పూతకు బదులుగా చిగుర్లు వచ్చాయని చెప్పారు. అందువల్ల చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను తెలియజేశారు.

కొనసాగుతున్న ఏనుగుల దాడులు

పాకాల, ఫిబ్రవరి 21: దామలచెరువు పంచాయతీ పరిధిలో పంటపొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి కాకర్లవారిపల్లె, మొరవపల్లె గ్రామాల పరిసరాలలో మామిడి, అరటి, కొబ్బరి, వరి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. పొలాల వద్దకు వెళ్లాలంటేనే రైతులు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల బెడద నుంచి రక్షించాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యమాలతోనే టీచర్ల సమస్యలకు పరిష్కారం

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



సభలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్లు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయడమే ఏకైక మార్గమని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. పీకే లేఅవుట్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఉద్యమ చైతన్య సభలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద పేరుకుపోయిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ ప్రకటించినా ఇంతవరకు విధివిధానాలు ఖరారు చేయలేదన్నారు. తక్షణం పీఆర్సీ అమలుకు చర్యలు చేపట్టాలని, అప్పటివరకు 30శాతం ఐఆర్ ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 27న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమానికి జిల్లానుంచి ఎక్కువ సంఖ్యలో టీచర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల, నాయకులు రమేష్ నాయుడు, దండు రామచంద్రయ్య, పద్మజ, సురేష్, శేఖర్, గీతమ్మ, భాస్కర్, చంద్రశేఖర్, నరేష్, మురళి, విజయనాగు, భాషా, నాగరాజ, లోకేష్, రమణ పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 21 : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై బుధవారం ఉదయం తలకోన సిద్ధేశ్వర స్వామి కల్యాణ మండపంలో పాలక మండలి సమావేశం జరిగింది. తలకోన ట్రస్ట్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సాధారణ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. తోపులాట, తొక్కిసలాట జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రద్దీకి అనుగుణంగా క్యూలైన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిత్యాన్నదానం చక్కగా నిర్వహించాలన్నారు. ఈవో జయకుమార్ మాట్లాడుతూ శివరాత్రి జరిగే ఐదు రోజులపాటు, మారుపొంగళ్ళు ఉత్సవం జరిగే రోజులు భక్తులకు తాగునీరు వసతి ఏర్పాట్లు చేస్తామన్నారు. సూచిక బోర్డుల ఏర్పాటు, భాకరాపేట, ఎర్రావారిపాలెం క్రాస్, నెరబైలు కూడలిలో బ్రహ్మోత్సవాల విద్యుత్ దీపాలంకరణలు చేపట్టాలని తీర్మానించారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ రావు, అన్నిశాఖల అధికారులు, పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రీ పోలింగ్ లేని ఎన్నికలే లక్ష్యం

● శిక్షణా కార్యక్రమంలో ఎస్పీ మలికా గర్గ్





తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 21 : 'మనకు ఎవరి అవార్డులు, రివార్డులు అవసరంలేదు... మన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ రీ పోలింగ్ లేని ఎన్నికలే లక్ష్యంగా పనిచేద్దాం' అని ఎస్పీ మలికా గర్గ్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసు అధికారులకు ఎన్నికల నిర్వహణపై మహిళా వర్సిటీ ప్రియదర్శిని ఆడిటోరియంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ గత ఎన్నికల్లో రీ పోలింగ్ జరిగిన సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తగినవిధంగా కేంద్ర పోలీసు బలగాలను నియమించి, అసాంఘిక శక్తులను అరికట్టి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎస్‌హెచ్‌ఓలదేనని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడులకు, ప్రలోభాలకు లొంగరాదని సూచించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి, ప్రలోభపెట్టేవారి వివరాలను ముందుగానే సేకరించి, వారిని ప్రమాదకరమైన (వల్నరబిలిటీ) మ్యాపింగ్‌లో చేర్చాలని చెప్పారు. హిస్టరీ షీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల వివాదాల్లో ప్రమేయమున్న వారిని తక్షణమే బైండోవర్ చేయాలని ఆదేశించారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను డిపాజిట్ చేయించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టులు, వాటి పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ మార్గాల్లో ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. గతంలో 10 లీటర్లకు మించి అక్రమ మద్యం కలిగిన కేసులు, ముద్దాయిల గురించి, ప్రస్తుతం వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అవసరమైతే వారిని బైండోవర్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, శివరామిరెడ్డి, సెబ్ రాజేంద్ర, ట్రైనీ ఐపీఎస్ దేవరాజ్ మనీష్ పాటిల్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సెక్టోరల్ పోలీసు అధికారులు, స్టేషన్ రైటర్లు, సీసీటీఎన్ఎస్ కంప్యూటర్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో నోడల్ ఆఫీసర్ల బాధ్యత కీలకం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యత కీలకమని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌తో కలిసి నోడల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో పొరబాట్లు జరగకుండా చూడాలన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయని, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికార, జిల్లా ఎన్నికల కమిషన్ ఇచ్చే సూచనలు అప్‌లోడ్ చేయాలని అన్నారు. సమన్వయంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



ఎస్వీయూ తెలుగు విభాగంలో..



పద్మావతి వర్సిటీ తెలుగు విభాగంలో..

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21 : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా సాగింది. ● ఎస్వీయూ తెలుగు విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, సలహాదారు ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. మాతృభాష ఔన్నత్యాన్ని తెలియజేశారు. విద్యార్థులు ఆలపించిన పాటలు, పద్యాలు, కవితలు ఆకట్టుకున్నాయి. ● పద్మావతి వర్సిటీ తెలుగు విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ కుసుమకుమారి, సెట్విన్ మేనేజర్ మోహన్‌రెడ్డి, భాషోద్యమ సమితి కార్యదర్శి టెంకాయల దామోదరం, విభాగాధిపతి సుభాషిణి, అధ్యాపకులు యువశ్రీ పాల్గొని మాట్లాడారు. మాతృభాషలోనే పిల్లలకు విజ్ఞానం సరిగా అందుతుందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ● పద్మావతి డిగ్రీ కళాశాల తెలుగు విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో సప్తగిరి ఉప సంపాదకులు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి పాల్గొని మాట్లాడారు. మాతృభాషతో పాటు ఇతర భాషలు కూడా నేర్చుకోవాలన్నారు. వార్డెన్ విద్యుల్లత, అధ్యాపకులు కస్తూరి, శోభ, అన్నమ్మ పాల్గొన్నారు. ● ఎస్వీ జూనియర్ కళాశాల తెలుగు విభాగంలో చేపట్టిన కార్యక్రమంలో ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ భువనేశ్వరిదేవి, అధ్యాపకులు మునేంద్ర, జయమ్మ, కల్పన, ధనమ్మ పాల్గొన్నారు. మాతృభాష ఉన్నతి కోసం అనేక మంది ఎంతో త్యాగం చేశారని కొనియాడారు.

తూనికల కొలతల అధికారుల దాడులు



ధాన్యం తూనిక రాళ్లను పరిశీలిస్తున్న లీగల్ మెటలర్జీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్

నాయుడుపేట, ఫిబ్రవరి 21: నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లోని పలు దుకాణాల్లో తూనికల కొలతల అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ప్రధానంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుదారుల తూనిక గుండ్లపై దృష్టి సారించారు. పెళ్లకూరు మండలంలోని చెంబేడు, పెళ్లకూరు ప్రాంతాల్లో పర్యటించారు. ధాన్యం కొనుగోళ్లలో తూనిక రాళ్లకు సీళ్లు, బరువు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. అలాగే నాయుడుపేట మండలంలోని పూడేరు, పుదూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లదారుల తూనిక రాళ్లను పరిశీలించారు. నాయుడుపేట బస్టాండ్ ప్రాంతంలో శీతల పానీయాలు అధిక ధరలకు అమ్ముతుండటంతో రెండు దుకాణాలపై కేసు నమోదు చేశారు. అలాగే చికెన్ షాపులను తనిఖీ చేశారు. పాత పోస్టాఫీసు వీధిలోని ఓ దుకాణంలో తూనిక రాళ్లకు సీళ్లు లేనట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తూనికల కొలతల అధికారి మల్లేష్ తెలిపారు. ఈ దాడుల్లో లీగల్ మెటలర్జీ సిబ్బంది రమణయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు

నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో పలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు... బెంగళూరుకు చెందిన ప్యారాచూట్ కంపెనీకి చెందిన కొబ్బరి నూనె పేరుతో నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో డూప్లికేట్ నూనెను విక్రయిస్తున్నారు. ప్యారాచూట్ కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు బధవారం రెండు పట్టణాల్లో దాడులు నిర్వహించి డూప్లికేట్ కొబ్బరి నూనె విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. 500 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసిన్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఏ నాగసురేష్, పీఆర్వో యామినీ సరస్వతి, డీసీటీవో మునీశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేజీబీవీ వార్షికోత్సవం



పిల్లలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ కిషన్

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 21: స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయం (కేజీబీవీ) వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థినుల నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నే రీతిలో పిల్లల అభ్యసన, క్రీడా సామర్థ్యాలను వేదికపై పంచుకోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసించారు. ఇంటర్ విద్యార్థులు పూజిత బృందం క్రీడల్లో కనబరిచిన ప్రతిభకు తహసీల్దార్ కిషన్ బహుమతి అందించారు. అలాగే జూనియర్ విభాగంలో లయ టీం, పాఠశాల విభాగంలో రెడ్డి ప్రసన్న, పావణి టీంలకు ఎంపీడీవో మధుసూదన్ రావు, ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిమళ, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలలో 24న పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 24వ తేదీన పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ప్రతి నెలా పౌర్ణమిరోజున శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో గరుడసేవను టీటీడీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

మంచి సంగీతాన్ని వినండి : డ్రమ్స్ శివమణి




తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం డ్రమ్స్ శివమణి దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మంచి సంగీతాన్ని ప్రతి ఒక్కరూ వినాలని తాను కోరుకుంటున్నానని అన్నారు. నూతన ఏడాదిలో మొదటిసారిగా తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. ఓ సంగీత కార్యక్రమం కోసం సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి అమెరికాకు వెళుతున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చినట్టు చెప్పారు. ఇటీవల విడుదలైన 'గుంటూరు కారం', 'లాల్ సలాం' చిత్రాలతోపాటు చాలా సినిమాల్లో డ్రమ్స్ వాయిద్యాన్ని అందించినట్టు తెలియజేశారు. అమెరికా తర్వాత జపాన్ టూర్‌కు కూడా వెళ్లనున్నట్టు వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమాన

తిరుపతి(లీగల్), ఫిబ్రవరి 21: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రూ.30వేలు జరిమాన విధిస్తూ తిరుపతి 4వ అదనపు మున్సిప్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. వీరిని తిరుపతి ట్రాఫిక్ కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు కోర్టులో ప్రవేశపెట్టారు.

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి పత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన, గోడపత్రికల ఆవిష్కరణ బుధవారం జరిగింది. ఆహ్వాన, గోడపత్రికలను ఆలయంలోని గురుదక్షిణామూర్తి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం మేధో దక్షిణామూర్తి సన్నిధిలో లాంఛనంగా ఆవిష్కరించి ఆహ్వాన పత్రికలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి అతని ఇండికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌ను వెంటాడుతున్న స్థానికేతర వివాదం

● నాన్‌లోకల్‌గా చూడొద్దు ప్లీజ్ అంటూ విన్నపం

సత్యవేడు, ఫిబ్రవరి 21: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు స్థానికేతర వివాదం వెంటాడుతూనే ఉంది. గతనెల 31వ తేదీన రాజేష్‌ను సత్యవేడు అభ్యర్థిగా ఖరారు చేస్తూ ఆపార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. రాజేష్ అభ్యర్థిత్వాన్ని సొంత పార్టీ నేతలు కొందరు పరోక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెరమీదకొచ్చిన స్థానిక నినాదంతో ఆ పార్టీలోని ఎస్సీ సామాజిక వర్గ నేతలు పలువురు స్థానికులైన తమకే టికెట్ కావాలంటూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నియోజకవర్గంలోని వరదయ్యపాళెంలో జరిగిన వలంటీర్ల సన్మానం కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తితో పాటు వైసీపీ అభ్యర్థి రాజేష్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు పార్టీ నేతలు తమ ప్రసంగంలో స్థానికేతర అంశాన్ని ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాజేష్ తాను నాన్ లోకల్‌గా చూడొద్దని, లోకల్‌గానే గుర్తించాలని కోరారు.

ప్రచార కార్యక్రమంలా వలంటీర్ల సన్మానం

వరదయ్యపాళెం మండలంలో బుధవారం ప్రభుత్వం నిర్వహించిన వలంటీర్ల సన్మానం వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలా మారింది. కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించాల్సి ఉండగా అతడిని ఓ మూలన కూర్చొబెట్టి కార్యక్రమం మొత్తం ఎంపీపీ భర్త దామోదర్ నడిపించడం విశేషం. కాగా మండలంలో 249 మంది వలంటీర్లు ఉండగా కార్యక్రమానికి 90 మంది డుమ్మాకొట్టడం గమనార్హం

వెనుక వరుసలో గిరిజన ప్రజా ప్రతినిధులు

కార్యక్రమంలో అధికార పార్టీ నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, ప్రొటోకాల్‌ను సైతం పట్టించుకోలేదు. ఎంపీతో పాటు వేదికపై ముందు వరుసలో కూర్చునేందుకు ప్రధాన సామాజికవర్గం నేతలు పోటీపడి, వరదయ్యపాళెం పంచాయతీ ప్రథమ మహిళ (సర్పంచ్) జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లుకు వేదికపై వెనుక వరుసలో కూర్చొబెట్టడం విమర్శలు చెలరేగాయి. సర్పంచ్ జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు ఇద్దరూ గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతోనే ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు ఎంపీ పాల్గొన్న కార్యక్రమంలోనే ఈ సంఘటన జరగడం గమనార్హం

వైసీపీ ఆత్మీయ సమావేశంలో నిరసన గళం

● నేతల తీరుపై ఎంపీకి ఎస్సీ, బీసీ నేతల ఫిర్యాదు

వరదయ్యపాళెంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ మండల అగ్రనేతల తీరుపై ఎస్సీ, బీసీ నేతలు నిరసన గళం వినిపించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వలంటీర్ల సన్మాన కార్యక్రమం అనంతరం ఎంపీపీ చాంబర్‌లో ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో నూకతోటి రాజేష్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ, బీసీ నేతలు మండల నేతల తీరును తూర్పారబట్టారు. తమ సామాజిక వర్గాల వారికి పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత లేదని, కేవలం తమను పల్లకి మోసే బోయిలుగానే చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారిపాకం ఎంపీటీసీ మధుసూదన రావు మాట్లాడుతూ ఒక ప్రజా ప్రతినిధిగా తాను ఏ కార్యాయాలకు వెళ్ళినా, కనీసం పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినా తన మాటకు విలువనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల నాయకులు సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ మండలంలో దళితులను వైసీపీకి ఓటు బ్యాంకుగానే చూస్తూ, పదవుల్లో మాత్రం మొండిచేయి చూపించి, ఉన్నత వర్గాలకు కట్టబెడుతున్నారని గోడు వెళ్లబోసుకున్నారు. ఎంపీ గురుమూర్తి కలుగ జేసుకుని ఇది పరిచయ కార్యక్రమం మాత్రమేనని, ఇక్కడ సమస్యలు వద్దని, వేరే వేదికపై చర్చించి అందరికీ న్యాయం చేస్తామని సర్దిచెప్పారు.





సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ - వెనుక వరుసలో కూర్చొన్న సర్పంచ్ జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు

జాతీయ స్థాయిలోనూ సత్తాచాటాలి


కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 21: ఆడుదాం ఆంధ్రా తుది సమరంలో రన్నరప్‌గా నిలిచిన కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆకాంక్షించారు. ఇటీవల విశాఖపట్నంలో ముగిసిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ మెన్ టీమ్స్ ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా పోరాడి రెండోస్థానంలో నిలిచాయి. రన్నరప్ కప్‌లతో బుధవారం క్రీడాకారులు కలెక్టర్‌ను కలిశారు. జిల్లాకు రెండు క్రీడాంశాలలో ద్వితీయ స్థానం రావడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం కప్, మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేసి, సత్కరించారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, విద్యాశాఖాధికారి శేఖర్, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన అద్దె బస్సులకు ఈ-టెండర్లు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 21 : జిల్లాలోని 11 డిపోలకు సంబంధించి 32 నూతన అద్దె బస్సులకు ఈ-టెండర్లు నిర్వహిస్తున్నట్లు ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. గూడూరుడిపో పరిధిలో గూడూరు-పొదలకూరు పల్లెవెలుగు 6, నెల్లూరు-తిరుపతి ఒక ఎక్స్‌ప్రెస్, సత్యవేడు డిపో ద్వారా సత్యవేడు-తిరుపతి పల్లె వెలుగు 6, తిరుపతి డిపో ద్వారా తిరుపతి-సత్యవేడు 4, తిరుపతి-కాణిపాకం 2, శ్రీకాళహస్తి డిపో పరిధిలో శ్రీకాళహస్తి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ ఒకటి, శ్రీకాళహస్తి-తిరుపతి పల్లె వెలుగు 3, ఎక్స్‌ప్రెస్ 2, సూళ్లూరుపేట డిపో పరిధిలో సూళ్లూరుపేట-తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ 2, వెంకటగిరి డిపో పరిధిలో వెంకటగిరి-నెల్లూరు ఎక్స్‌ప్రెస్ 4, వెంకటగిరి-తిరుపతి పల్లెవెలుగు ఒకటి ఉన్నాయి. మార్చి 6వ తేదీ వరకు టెండరుకు అవకాశం ఉంటుందని, మరిన్ని వివరాలకు 9110797132ను సంప్రదించాలని కోరారు.

అమ్మ భాషను కాపాడుకోవడం అందరి బాధ్యత


తెలుగు తల్లికి నివాళి అర్పిస్తున్న నేతలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 21: కమ్మనైన అమ్మ భాషను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని, దాని కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. రాయలసీమ రంగస్థలి కళాకారుల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవం నిర్వహించారు. రంగస్థలి కార్యాలయంలో ఉదయం తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ సలహాదారు సుబ్రహ్మణ్యంయాదవ్, ఉపాధ్యక్షులు తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కార్యదర్శి కన్నప్పరెడ్డిగారి కేశవరెడ్డి, చంద్రబాబునాయుడు, కామేష్, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏటా డ్యూటీ చార్ట్ వేస్తాం


డీపీటీవోతో చర్చిస్తున్న ఈయూ నేతలు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 21: జిల్లా పరిధిలోని 11 డిపోల్లో ఏటా డ్యూటీ చార్టు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డీపీటీవోను కలసి పలు సమస్యలపై చర్చించారు. ఓడీ డ్యూటీ వద్దని, గ్యారేజీలో అన్ని రకాల టూల్స్ అందుబాటులో ఉంచాలని, కొత్తబస్సు ఏర్పాటు చేయాలని, ఘాట్‌లో వన్‌మెన్ డ్రైవర్లకు టైమింగ్స్ ఫిక్స్ చేయాలని కోరారు. మరికొన్ని సమస్యలపైనా చర్చించారు. పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఈ.రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గురునాథం, కార్యదర్శి తండాయం సత్యనారాయణ, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ పాల్గొన్నారు.

డాక్టరేట్ల ప్రదానం


గోదాలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: ఎస్వీయూ హోం సైన్స్ విభాగ పరిశోధకురాలు కామిశెట్టి గోదాలక్ష్మి డాక్టరేట్ పొందారు. అప్రైజ్‌మెంట్ ఆఫ్ ఎక్జైటింగ్ ప్రి-స్కూల్స్ ఇన్ టెర్మ్స్ ఆఫ్ క్వాలిటీ స్టాండర్డ్స్ అంశంపై ప్రొఫెసర్ కె.అనురాధ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.


నిర్మల బాయి

ఎస్వీయూ ఎకనమిక్స్ స్కాలర్ ఎం.నిర్మలబాయి డాక్టరేట్ పొందారు. ఇంపాక్ట్ ఆఫ్ మిడ్‌డే మీల్ ప్రోగ్రామ్ ఆన్ ద ఎన్‌రోల్‌మెంట్ అండ్ డ్రాపౌట్‌రేట్ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ చిల్డ్రెన్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ సవరయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు సేతు గుణశేఖరన్ పురస్కారం


పురస్కారాన్ని స్వీకరిస్తున్న ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు ప్రముఖ శాస్త్రవేత్త సేతు గుణశేఖరన్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఫిజిక్స్ బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో దేవప్రసాదరాజు చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రకటించారు. తమిళనాడు కృష్ణగిరి జిల్లా కట్టేరిలోని శ్రీవిద్య ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయన వర్సిటీలోనే పీహెచ్‌డీ పూర్తి చేసి, 2007లో ఫిజిక్స్ విభాగంలో అధ్యాపకులుగా చేరారు. 25 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఆయన పర్యవేక్షణలో 12పీహెచ్‌డీలు పూర్తయ్యాయి. 100కు పైగా పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం ఏపీ రీసెట్-2024 కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఘనంగా సైన్స్‌డే సంబరాలు


సంబరాలను పరిశీలిస్తున్న ఎంఈవో బాలాజి

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 21: మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామ పంచాయతీలో గల రవితేజ ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ స్కూల్‌లో బుధవారం సైన్స్‌డే సంబరాలను పాఠశాల డైరెక్టర్ రవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అర్బన్ ఎంఈవో కె.బాలాజి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను ఇటువంటి ప్రయోగాల ద్వారా వెలికి తీయవచ్చన్నారు. పిల్లలు తయారు చేసిన పలు ప్రాజెక్టులు చాలా బాగున్నాయని, వారికి మరింత ప్రోత్సాహం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అప్స(ఏపీ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్) తిరుపతి జిల్లా డెమొక్రటిక్ అధ్యక్షుడు ఆర్.శ్రీధర్, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి కుప్పయ్య, స్కాప్స(శ్రీకాళహస్తి ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్) కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరుమలలో అదుపుతప్పిన ట్రాక్టర్

ఇద్దరు తమిళనాడు భక్తులకు గాయాలు

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం ఓ ట్రాక్టర్ అదుపుతప్పి గేటును ఢీకొన్న క్రమంలో ఇద్దరు తమిళనాడు భక్తులు గాయపడ్డారు. తిరుమలలో భవన నిర్మాణానికి సంబంధించిన ఓ ట్రాక్టర్ షాపింగ్ కాంప్లెక్స్ వైపుగా వచ్చింది. డ్రైవర్ బ్రేక్‌కు బదులు ఎక్స్‌లేటర్ తొక్కడంతో ట్రాక్టర్ అదుపుతప్పి మూసి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గేటును, పక్కనే నిలబడి ఉన్న ఇద్దరు భక్తులను ఢీకొట్టింది. భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

అక్షరంపై దాడి అన్యాయం

జర్నలిస్టులపై వైసీపీ మూకల దాడులపై విద్యార్థి సంఘాల నేతల ప్రతిస్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: అక్షరంపై దాడి చేయడం అన్యాయమని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ముందు బుధవారం విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్రనాయక్, తిరుపాల్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు ప్రవీణ్, చంద్రనాయక్, సురేష్‌నాయక్, హరికృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు సమాధి



జర్నలిస్టులపై ఉన్మాద స్థాయిలో దాడులు సాగుతున్నాయి. వీటిని ఖండించడానికి అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలి. జర్నలిస్టులపై అల్లరి మూకలతో దాడి చేయించడం సిగ్గు చేటు.
- రాగల ఆనంద్ గౌడ్, తెలుగు యువత నేత

జర్నలిస్టులపై దాడి అనాగరిక సంస్కృతికి నిదర్శనం



రాజకీయ నాయకులు వీధి రౌడీలకంటే దారుణంగా వ్యవహరిస్తున్నారనే విషయం ఇటీవల జర్నలిస్టులపై జరిగిన దాడులు రుజువు చేస్తున్నాయి. ప్రజల స్వరాన్ని ప్రభుత్వానికి తెలియజేసే జర్నలిస్టులపై ఇలాంటి దాడులు చేయడం సిగ్గు చేటు. ఇలాంటి దాడులను అనాగరిక సంస్కృతికి నిదర్శనంగా భావిస్తున్నాం.
- బండి చలపతి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

సీఎం జగన్ నైతిక బాధ్యత వహించాలి



రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను వైసీపీ ప్రభుత్వం హరిస్తోంది. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలోనే జర్నలిస్టులపై దాడి జరిగింది. భౌతిక దాడులు చేయడం సిగ్గుచేటు. ప్రజాస్వామిక వాదులందరూ ఇలాంటి సంఘటనలను ఖండించాలి. జర్నలిస్టు కృష్ణపై జరిగిన దాడికి సీఎం జగన్ నైతిక బాధ్యత వహించాలి.
- డాక్టర్ ఎన్.శేషాద్రి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి

దాడి చేసిన వారిని అరెస్టు చేసే దాకా పోరాటం



జర్నలిస్టులపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించడం ద్వారా ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛ విషయంలో తన కున్న నిజాయితీని నిరూపించుకోవాలి.
- మల్లికార్జున, ఎన్ఎస్‌యూఐ నేత

అరాచకానికి అక్షరం భయపడదు..



చరిత్రలో పత్రికలపైన, జర్నలిస్టులపైన అనేక రూపాల్లో దాడులు జరిగాయి. వాటికి వెరవక అక్షరం జెండాలాగా రెపరెపలాడుతూనే ఉంది. చరిత్రలో అరాచకత్వానికి అక్షరం బెదిరలేదు. జర్నలిస్టులపై దాడి చేయడమంటే వైసీపీ ప్రభుత్వం తన భవిష్యత్తును తానే కాలరాసుకున్నట్టుగా అనిపిస్తోంది.
- కొట్టే హేమంత్ రాయల్, టీఎన్ఎస్ఎఫ్ నేత

ప్రజలు తిరగబడే రోజులు దగ్గరకొస్తున్నాయి..



జర్నలిస్టులపై దాడి చేయడానికి మించిన దౌర్భాగ్యం సమాజంలో ఇంకేమీ ఉండదు. పత్రికా స్వేచ్ఛ ఉంటేనే ప్రజల హక్కులకు భరోసా ఉంటుంది. పత్రికలపైనా, జర్నలిస్టులపైనా దాడి చేయడం అంటే, ప్రజలపై దాడి చేసినట్టే. ప్రజాస్వామ్యానికీ, పత్రికా స్వేచ్ఛకూ విలువ ఇవ్వని పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అనిపిస్తోంది.
- శివశంకర్‌నాయక్, నవ సమాజ గిరిజన ఫెడరేషన్ నేత

జర్నలిస్టులపై దాడిని అందరూ ఖండించాలి



జర్నలిస్టులపై దాడిని అన్ని వర్గాలు ఖండించాలి. లేకపోతే రేపు ప్రజలు కూడా ప్రశ్నించే అవకాశం కోల్పోతారు. ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్ కృష్ణపై దాడి ఘటనను ప్రజలు గమనిస్తున్నారు. ఇంత దారుణంగా జర్నలిస్టులపై దాడి చేయడం ఏమిటని సామాన్య ప్రజలు కూడా అంటున్నారు.
- అక్కులప్ప నాయక్, టీఎస్ఎఫ్ నేత

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి..



రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు చీకటి పాలనకు సంకేతంగా అనిపిస్తోంది. పత్రికలను, జర్నలిస్టులను బెదిరించాలని భావించే ఎవ్వరూ ప్రజల మధ్య మనుగడ సాగించలేరు. ప్రభుత్వ తప్పు ఒప్పులను ప్రజలకు తెలియజేసే జర్నలిస్టులపై దాడులు చేయడం సిగ్గుచేటు.
- బాటసారి, జన సేన విద్యార్థి విభాగం నేత



జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన

తిరుపతి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జర్నలిస్టు సంఘాల నేతలు ప్రసాద్, నరేంద్ర, మునిరాజ తదితరుల ఆధ్వర్యంలో ఎస్వీయూ మెయిన్ గేటు వద్దే అంబేద్కర్ విగ్రహం ఎదుట మీడియా ప్రతినిధులు బుధవారం ఆందోళన చేపట్టారు. నిందితులను అరెస్టు చేసే వరకూ ఆందోళన కార్యక్రమాలు విరమించేది లేదని హెచ్చరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 62,304 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,261 మంది తలనీలాలు సమర్పించారు.

పారిశుధ్య కార్మికుల మధ్య ఘర్షణ

● ఒకరికి గాయాలు


గాయపడ్డ వెంకటలక్ష్మి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 21 : రుయాస్పత్రిలో రెండు గ్రూపులుగా విడిపోయిన పారిశుధ్య కార్మికులు తరచూ గొడవలకు దిగుతున్నారు. ఏజెన్సీ నిర్వాహకులకు అనుకూలంగా ఒక గ్రూపు, వ్యతిరేకంగా మరో గ్రూపు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం విధులకు వెళ్లిన వెంకటలక్ష్మి అనే కార్మికురాలిని పారిశుధ్య కార్యాలయంలోని సూపర్‌వైజర్లు అడ్డగించి తమకు వ్యతిరేకంగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటే విధుల నుంచి తొలగిస్తామని బెదిరించారు. తమకు జీతాలు సకాలంలో ఇస్తే ఎందుకు ఆందోళన చేస్తామని ఆమె సమాధానం చెప్పడంతో అక్కడే ఉన్న ఏజెన్సీకి అనుకూల కార్మికులు ఆగ్రహంతో రెచ్చిపోతూ ఆమెపై దాడికి పాల్పడ్డారు. సర్జరీ బ్లేడుతో దాడికి పాల్పడటంతో ఆమె చేతికి బలమైన గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం అత్యవసర విభాగానికి తీసుకువెళ్లారు. ఏజెన్సీ నిర్వాహకులు వేధిస్తున్నారని, జీతాలు సరిగా ఇవ్వడం లేదని కొన్ని రోజులుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఈ క్రమంలో సమస్య ముదిరి దాడుల వరకు వెళ్లిందన్న విమర్శలున్నాయి. ఏజెన్సీ నిర్వాహకుల నుంచి మామూళ్లు వస్తుండడం వల్లే అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అస్వస్థతకు గురైన ఓ వ్యక్తి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తిరుమలలో గదులు కేటాయించే సీఆర్వో వద్ద ఈ నెల 17వ తేదీన 32 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. తిరుమల టూటౌన్ పోలీసులు అతన్ని స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు తిరుమల టూటౌన్ 0877-2263733కు తెలియజేయాలని ఎస్ఐ సాయినాథ్ చౌదరి కోరారు.

నటరాజన్‌కు ఆత్మీయ సన్మానం



తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 21: ప్రపంచ క్లారినెట్ చక్రవర్తి పద్మశ్రీ ఏకేసీ నటరాజన్‌ను తిరుపతి వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాదస్వర విద్వాంశులు ఎస్.మునిరత్నం పాల్గొన్నారు.

తిరుపతికి నావంటి నాయకుడే కావాలి

భూమన అభినయ్‌రెడ్డి


అభినయ్‌రెడ్డిని సన్మానిస్తున్న మురళీరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 21: 'నా వంటి అప్‌డేటెడ్ నాయకులే ప్రస్తుత రాజకీయాలకు అవసరం' అని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చెప్పారు. ప్రకాశం నగర్ క్వార్టర్స్‌లో ఏపీ వైఎస్ఆర్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేతంరెడ్డి మురళీరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవుట్‌డేటెడ్ నాయకులు తిరుపతికి పనికిరారన్నారు. గడిచిన రెండున్నరేళ్లలోనే తిరుపతి రూపురేఖలు సమూలంగా మార్చి వేశామని తెలిపారు. ఈ సమావేశంలో 23వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, వైసీపీ వార్డు ఇన్‌చార్జి రఘురామిరెడి పాల్గొన్నారు.

ఆ బాండ్లు రూ.30 కోట్లకు ఇచ్చేస్తా

ఆనం వెంకటరమణారెడ్డికి కంచి రాము సవాల్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 21: 778 అంకణాలు మాస్టర్‌ప్లాన్ రోడ్డులో పోగొట్టుకోవడంతో నగరపాలక సంస్థ నుంచి 61.2కోట్లు టీడీఆర్ బాండ్లు తాను తీసుకున్నానని ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారని, అయితే అవి మార్కెట్‌లో 30శాతం విలువతో మాత్రమే అమ్ముడుపోతాయని తిరుపతి టింబర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కంచి రాము తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనం ఆరోపణలను తప్పుపట్టారు. ఆనం వెంకటరమణారెడ్డి కోరుకుంటే రూ.30కోట్లకు ఆ బాండ్లు ఆయనకే అమ్ముతానని అన్నారు. పిత్రార్జితంగా వచ్చిన భూమిపై, ఎలాంటి రాజకీయ సంబంధాలు లేని తనపై ఆరోపణలు చేయడం బాధాకరం అన్నారు. కాగా ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపణలు అసత్యమని వైసీపీ సేవాదళ్ అధ్యక్షుడు ఆరుణ్‌యాదవ్ బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఖండించారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా బురద జల్లుతున్నారని అన్నారు.

సాంకేతిక రంగంలో గణాంకశాస్త్రం కీలకం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పక్కనే రమేష్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 21 : మానవుడి దైనందిన జీవనంతో పాటు సాంకేతిక రంగంలో గణాంక శాస్త్రం కీలక భూమిక పోషిస్తుందని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. కళాశాలలో జాతీయ నమూనా సర్వే సంస్థ(ఎన్ఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో బుధవారం గణాంకశాస్త్ర విద్యార్థులకు ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలోని ఉపాధి అవకాశాలపై అవగాహ కల్పించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ డేటా సైన్స్, మెషిన్‌లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో స్టాటిస్టిక్స్ కీలకంగా ఉందని వివరించారు. ఎన్ఎస్ఎస్ఓ కడప ప్రాంతీయ కార్యాలయ ఉపసంచాలకులు ఇ.రమేష్ మాట్లాడుతూ డేటాను విశ్లేషించడానికి, దానినుంచి తీర్మానాలను రూపొందించేందుకు గణాంకశాస్త్రం కీలకంగా ఉందని తెలిపారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ చంద్రకేశవులు, ఎన్ఎస్ఎస్ఓ ఉద్యోగులు శ్రీనివాసరావు, ప్రశాంతి, శ్వేత, కౌశిక్‌మిత్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 21 : జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో స్టడీ అవర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సంక్షేమ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు, గురుకుల పాఠశాలల అధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగ విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, శ్రీనివాసులు, జయభారతి పాల్గొన్నారు.

రోగుల సహాయకులు ఓటీల్లో స్థిరపడ్డారు

● పూర్తి స్థాయిలో కానరాని ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు


రోగిని స్ట్రెచ్చర్‌పై తీసుకెళుతున్న సహాయకులు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 21 : ఆస్పత్రికి వచ్చే రోగులకు సాయంగా ఉండాల్సిన ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలను ఆపరేషన్ థియేటర్లలో సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమించారు. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే రోగులకు సహాయం చేసేవారు లేక అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిలో ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు 119 మంది ఉండాలి. 85 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో పది మంది పలు ఓటీ థియేటర్లలో సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా స్థిరపడిపోయారు. కదల్లేని స్థితిలో ఉన్న రోగులను వారు స్ట్రెచ్చర్, వీల్‌చైర్‌లపై పలు వార్డులకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. సరిపడా లేకపోవడంతో రోగుల సహాయకులే ఆ పని చేయాల్సి వస్తోంది. అసలే సిబ్బంది కొరతగా ఉంటే కొంతమందిని వేరే విధులకు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. అరకొర సిబ్బంది కూడా చేయి తడపనిదే స్ట్రెచ్చర్ ముట్టుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. వార్డుల్లో దుప్పట్లు, రోగులకు డైపర్‌లు మార్చాలన్నా డబ్బు డిమాండ్ చేస్తున్నారని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్‌జీఎస్‌లో మాతృభాషా దినోత్సవం


విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి(విద్య),ఫిబ్రవరి21: టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మభాష ఔన్నత్యాన్ని..మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. డాక్టర్ విజయ్‌కుమార్, తెలుగు విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ఎం.మాదన్న, అధ్యాపకులు కొండలరావు, శివకుమార్, కోటేశ్వరయ్య, చంద్రయ్య, మణి, వే ఫౌండేషన్ అధ్యక్షుడు అంకయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన స్ట్రెస్ మేనేజ్‌మెంట్ శిక్షణ


విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 21: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాల అధ్యాపకులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సూసైడ్ ప్రివెన్షన్, మెంటల్‌హెల్త్ అంశాలపై ప్రాంతీయ ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. స్థానిక శ్రీచైతన్య, ఎస్ఆర్ జూనియర్ కళాశాలల కేంద్రంగా అధ్యాపకులకు ఢిల్లీ, కేరళ, హైదరాబాద్‌కు చెందిన ఎక్స్‌పర్ట్స్ నేతృత్వంలో వర్చువల్‌గా ఈ శిక్షణ నిర్వహించినట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశామని తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా సైకాలజీ ప్రొఫెసర్ శోభన్‌కుమార్ వ్యవహరించారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థుల జయకేతనం



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 21: కోల్‌కతాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ విడుదల చేసిన సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో ఎల్‌బీసీరోడ్డులోని ఎమరాల్డ్స్ ప్రొఫెషనల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి జయకేతనం ఎగురవేశారని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పేర్కొన్నారు. పి.భార్గవి 485మార్కులు, ఎ.భాస్కర్ 458, వి.చంద్రమౌళి 440, కె.శశిధర్ 414వంటి అత్యుత్తమ మార్కులు సాధించడంతో పాటు 58.67శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు వివరించారు. విద్యార్థులను డైరెక్టర్స్ ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్, అధ్యాపకులు అభినందించారు.

తూనికల కొలతల అధికారుల దాడులు



ధాన్యం తూనిక రాళ్లను పరిశీలిస్తున్న లీగల్ మెటలర్జీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్

నాయుడుపేట, ఫిబ్రవరి 21: నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లోని పలు దుకాణాల్లో తూనికల కొలతల అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ప్రధానంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుదారుల తూనిక గుండ్లపై దృష్టి సారించారు. పెళ్లకూరు మండలంలోని చెంబేడు, పెళ్లకూరు ప్రాంతాల్లో పర్యటించారు. ధాన్యం కొనుగోళ్లలో తూనిక రాళ్లకు సీళ్లు, బరువు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. అలాగే నాయుడుపేట మండలంలోని పూడేరు, పుదూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోళ్లదారుల తూనిక రాళ్లను పరిశీలించారు. నాయుడుపేట బస్టాండ్ ప్రాంతంలో శీతల పానీయాలు అధిక ధరలకు అమ్ముతుండటంతో రెండు దుకాణాలపై కేసు నమోదు చేశారు. అలాగే చికెన్ షాపులను తనిఖీ చేశారు. పాత పోస్టాఫీసు వీధిలోని ఓ దుకాణంలో తూనిక రాళ్లకు సీళ్లు లేనట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు తూనికల కొలతల అధికారి మలేష్ తెలిపారు. ఈ దాడుల్లో లీగల్ మెటలర్జీ సిబ్బంది రమణయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు

నాయుడుపేట, ఫిబ్రవరి 21: నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో పలు దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టారు. విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు... బెంగళూరుకు చెందిన ప్యారాచూట్ కంపెనీకి చెందిన కొబ్బరి నూనె పేరుతో నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో డూప్లికేట్ నూనెను విక్రయిస్తున్నారు. ప్యారాచూట్ కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు బధవారం రెండు పట్టణాల్లో దాడులు నిర్వహించి డూప్లికేట్ కొబ్బరి నూనె విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. 500 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఐ నాగసురేష్, పీఆర్వో యామినీ సరస్వతి, డీసీటీవో మునీశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

'జగనన్నకు చెబుదాం'లో వినతుల వెల్లువ



వినతిపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

వడమాలపేట, ఫిబ్రవరి 21: వడమాలపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, డీఎల్‌పీవో రూపారాణి ఆధ్వర్యంలో అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ఆధ్వర్యంలో పలు సమస్యలను వివరిస్తూ పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. మండలంలో ప్రధానంగా డీకేటీ భూముల నిర్ధారణలో అవకతవకలు జరుగుతున్నాయని, అనుభవదారుల ఆధీనంలో ఉన్న భూములను ఇతరులకు దారాదత్తం చేస్తున్నారని, అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వడమాలపేటలో శ్మశాన భూములను సర్వేచేసి రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఎస్‌బీఆర్ పురంలో గూళూరు చెరువు తూములకు మరమ్మతులు చేయాలని, డంపింగ్ యార్డ్ స్థలం నిర్ధారణ చేయాలని సర్పంచు మణిరాజు కోరారు. వడమాల నుంచి రామరాజుకండ్రిగ, తిరుమణ్యం నుంచి ఎనమలపాలెం రోడ్డు దుస్థితిలో ఉందని, వడమాలపేట చీమలవారి వంకపై శాశ్వత ప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మండలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని కోరారు.

హెల్త్ సెంటర్ ప్రారంభం

పుత్తూరు, ఫిబ్రవరి 21: పుత్తూరు మున్సిపాలిటీలో రూ.80 లక్షలతో నిర్మించిన గోవిందపాలెం హెల్త్ సెంటర్ భవనాన్ని బుధవారం మంత్రి రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హరి, మున్సిపల్ చైర్మన్ హరి, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైసీపీ నాయకులు జయప్రకాష్, శంకర్, నారాయణరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రోజా

వైభవంగా సెల్వవినాయక ఆలయ కుంభాభిషేకం

పుత్తూరు, ఫిబ్రవరి 21: పుత్తూరు మున్సిపాలిటీలోని పిళ్లారిపట్టు రోడ్డులో వున్న సెల్వ వినాయక ఆలయ కుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. వేదపండితులు కలశహోమ క్రతువులను నిర్వహించారు. ఏటిలింగం, లక్ష్మీనారాయణ, కంచి హరిప్రసాద్, గోవిందరాజు పాల్గొన్నారు.

మీడియాపై దాడులు దుర్మార్గం

వడమాలపేట, ఫిబ్రవరి 21: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండే మీడియా ప్రతినిధులపై వైసీపీ మూకలు దాడికి పాల్పడడం దారుణమని నగరి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. వడమాలపేటలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిని తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి జగన్ అహింసాయుత పద్ధతులతో రాజ్యమేలుతున్నారని ధ్వజమెత్తారు. ఒంగోలుకు చెందిన తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపడం ఖాయమని వెంకటేశ్వరరావు అన్నారు.



వెంకటేశ్వరరావు

వలంటీర్లకు పురస్కారాలు



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో అధికారులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 21: మున్సిపాలిటీ పరిధిలో విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. బుధవారం పట్టణంలోని కావమ్మ ఆలయం పక్కన ఉన్న మున్సిపల్ భవనంలో చైర్మన్ అనంగి హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్ చేతుల మీదుగా ఒకరికి సేవావజ్ర, ఐదుగురికి సేవా రత్న, 227 మంది వలంటీర్లకు సేవామిత్ర పురస్కారాలతో పాటు దుశ్శాలువతో సత్కరించి సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21: సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో ఫ్లైఓవర్ వద్ద రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు... ఓ మహిళ ఫ్లైఓవర్ కింద రైల్వేట్రాక్ దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్లే జీటీ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు ఎరుపు రంగుచీర, బ్లూ రంగు రవిక ధరించి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొదట నేర్చుకునేది మాతృభాష

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: ప్రతి మనిషి తన జీవితంలో మొదటగా నేర్చుకొనేది అమ్మలాంటి మాతృభాషేనని ఇండియా ఆన్ ది మూన్ ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య అజిత్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలు బుధవారం ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘణంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉషోదయఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల ఉష, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే మీడియాపై దాడి

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం మీడియాపై దాడి చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కిలారి మోహన్‌కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికిపాల్పడిన వారిని కఠినంగా శిక్షించి మీడియా స్వేచ్ఛను కాపాడాలన్నారు.

మట్కా బీటర్ అరెస్టు


వరదయ్యపాళెం, ఫిబ్రవరి 21: స్థానిక బీసీ కాలనీకి చెందిన ఖాదర్‌బాషా మట్కా ఆడుతున్నట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ప్రతాప్ అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

తిరుపతిని రాజధాని చేయాలి: చింతా

రేణిగుంట,ఫిబ్రవరి21: తిరుపతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం కూడలి వద్ద తిరుపతిని రాజధానిగా ప్రకటించాలని కోరుతూ బ్యానర్లతో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు విఆర్ రావణన్, సి.మణి,సురేష్, నాగరాజరెడి పాల్గొన్నారు.

జాగ్రత్త పడకుంటే కష్టాలే!

- ప్రాజెక్టుల్లో దిగజారుతున్న నిల్వలు
- ఇంకా నెలన్నరపాటు నీరివ్వాల్సిన పరిస్థితి
- కేటాయింపులకు మించి సాగవుతున్న పంటలు
- తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం



అడుగంటుతున్న సోమశిల జలాశయం

నెల్లూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటల సాగు కీలక దశకు చేరుకుంది. కొన్నిచోట్ల వచ్చే నెలలో వరి కోతలు ప్రారంభం కానుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్‌లో కోతలు జరగనున్నాయి. ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మిచౌంగ్ తుపాన్ దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయి రెండోసారి నార్లు పోసుకున్నారు. ఈ పరిస్థితుల్లో కనుపూరు కెనాల్ మినహాయించి పెన్నా డెల్టాలో మార్చి 15వ తేదీ వరకు కనుపూరు, కావలి, ఉత్తర, దక్షిణ కాలువ కింద ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంటుందని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో 2 లక్షల ఎకరాలకు నీటి కేటాయింపులు ఇచ్చేలా నిర్ణయం తీసుకోగా, ఆ తర్వాత లెక్కలు మారిపోయాయి. 3లక్షల ఎకరాల వరకు సాగు జరుగుతున్నట్లు అంచనా. దీంతో గతంలోలా కాకుండా ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. కండలేరు కింద గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనధికారికంగా చెరువుల్లో ఉన్న నీటితో పంటలు వేసేశారు. ఇప్పుడు ఆ పంటలను కాపాడుకునేందుకు నీరు ఇవ్వాలని అధికారులపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు సోమశిల కింద కావలి, దక్షిణ కాలువల చివరి ఆయకట్టుకు నీరందడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. బుధవారం సోమశిలలో 19.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజుకు 3500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఆవిరి నష్టాలతో కలుపుకొని మూడు రోజులకు ఒక టీఎంసీ ఖర్చవుతోంది. మరో రెండు వారాలు ఇదే మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత డెల్టా ప్రాంతానికి కొంత తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ లెక్కన చూసుకున్నా ఏప్రిల్ మొదటి వారం వరకు మరో పది టీఎంసీలలోపు మాత్రమే ఖర్చు చేయగలిగితేనే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. అప్పుడు 7.50 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను మరో రెండు టీఎంసీలు తాగునీటి అవసరాలకు సరిపోతాయి. అలా కాకుండా నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం వహిస్తే తాగునీటికి ఇబ్బందులు పడాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగుకు పోను మిగిలిన నీటితోనే అక్టోబరు వరకు జిల్లా తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంటుంది.

చెన్నైకు అవసరం లేదు!

ఈ ఏడాది చెన్నై తాగునీటి అవసరాలకు ఇంత వరకు సోమశిల నుంచి నీటి విడుదల చేయలేదు. అదృష్టవశాత్తూ మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో చెన్నైలోని రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి. వారికి ఇప్పట్లో నీటి అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి ఆ మిగులు నీరే ఇప్పుడు పంటలను కాపాడుతోందని అంటున్నారు. అదే సమయంలో కండలేరులో 10.70 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు పోను నికరంగా 2.30 టీఎంసీలు మాత్రమే సాగు, తాగుకు నీరు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నారు. కానీ గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయాలంటూ రైతుల నుంచి విన్నపాలు అందుతుండటంతో కచ్చితంగా నీటిని ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పుడు గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాలకు తాగునీటిని డెడ్‌స్టోరేజీ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని భావిస్తున్నారు. ప్రతి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకుంటేనే వర్షాకాలం వరకు ఇబ్బందులు లేకుండా నెట్టుకురాగలుగుతామని నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఉన్నతాధికారులు నిరంతరం నీటి యాజమాన్యాన్ని పర్యవేక్షించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

టీడీపీ విజయానికి కలసికట్టుగా కృషి చేద్దాం: పాశిం



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరం కలసికట్టుగా పని చేద్దామని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. బుధవారం కోట మండలం కేశవరం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తున్న మీడియా ప్రతినిధుల మీద, పత్రికా కార్యాలయాలపై వైసీపీ నాయకులు దాడులకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. అరాచక పాలనను చూసి తట్టుకోలేక వైసీపీ నుంచి పలువురు టీడీపీలోకి చేరుతున్నారన్నారు. రాష్ట్రానికి అభివృద్ధి పథంలో నడిపించగల సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, సర్వోత్తమరెడ్డి, వేణు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, ప్రవీణ్‌రెడ్డి, సురేంద్ర, సుధీర్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని రెడ్డిగుంట, తిరుపతిగారిపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుద్దా రాఘవరెడ్డి, మట్టం శ్రావణి, అమరేంద్ర, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, సుధాకర్ నాయుడు, విజయ్‌భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

వెంకటగిరిలో మిస్ ఇండియా భావన



దంత పరికరాన్ని ప్రారంభిస్తున్న భావన

వెంకటగిరిటౌన్, ఫిబ్రవరి 21: పట్టణంలోని సుమన్ ప్రజా దంత వైద్యశాలలో త్రీడీ డిజిటల్ ఇంట్రా ఓరల్ కేంద్రాన్ని '2023 మిస్ ఇండియా ఐ కానిక్ దివా' భావన చినతంబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పట్టణమైన వెంకటగిరిలో డాక్టర్ సుమన్ కార్పొరేట్‌కు దీటుగా ఆధునిక దంత యంత్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్ర, శ్రీకాళహస్తి కమిషనర్ రమేష్ బాబు, డాక్టర్ సంజీవరాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి



ద్విచక్ర వాహనాన్ని ఢీ కొని తుప్పల్లోకి దూసుకెళ్లిన సుమో

కేవీబీపురం ఫిబ్రవరి21: మండలంలోని పోలీనాయుడు కండ్రిగ గ్రామం వద్ద బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని సుమో ఢీ కొనడంతో హరి నాయుడు(43) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎ్‌సఐ లోకనాథం కథనం మేరకు... పోలినాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన హరినాయుడు దిగువపూడి గ్రామం వద్ద తన పొలానికి బయలుదేరి, ఫోన్ రావడంతో ద్విచక్రవాహనంపై కూర్చుని మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన టాటా సుమో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో హరి నాయుడు కిందపడి గాయపడిపోయాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సుమో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, హరి నాయుడు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ



పిల్లలకు విద్యాసామగ్రి అందజేస్తున్న యువనేస్తం సభ్యుడు

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తి మండలంలోని భైరవ ఎస్టీ కాలనీలోని పిల్లలకు యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్ విద్యాసామగ్రి బుధవారం పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సుబ్బరామి రెడ్డి ఆర్థిక సహాయంతో పిల్లలకు విద్యాసామగ్రి అందిచామన్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు చక్రపాణి మృతి



చక్రపాణినాయుడు (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, ఫిబ్రవరి 21: ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చక్రపాణి నాయుడు(65) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గత కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బుధవారం సాయంత్రం శ్వాస విడిచారు. చక్రపాణినాయుడు మృతదేహానికి గురువారం ఉదయం 10గంటలకు వారి స్వగ్రామంలో దహనక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయానికి విరాళం



ఆలయానికి విరాళం అందజేస్తున్న హెలెన్ హేమలత

కేవీబీపురం ఫిబ్రవరి21: మండలంలోని మఠం గ్రామంలో ఇటీవల నిర్మితమై బుధవారం కుంభాభిషేకం జరుపుకున్న వీరభద్ర స్వామి ఆలయానికి హెలెన్ హేమలత, మునిస్వామి యాదవ్ రూ.15వేలు విరాళంగా అందజేసి స్వామివారిని దర్శించుకున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలించిన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ హుస్సేన్

పిచ్చాటూరు, ఫిబ్రవరి 21: పిచ్చాటూరు మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలను కొత్తగా వచ్చిన పిచ్చాటూరు మండల తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్ సందర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన కొరకు బుధవారం మండలంలోని ముడియూరు, పాఠశాలల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని కరెంటు, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల దివ్యాంగుల కొరకు ర్యాంపులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, వీఆర్‌వో కృష్ణయ్య, బీఎల్‌వోలు, పంచాయతీ సెక్రటరీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వలసకూలీ మృతి



సాహిల్ అలీ (ఫైల్‌ఫొటో)

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 21: బతుకుదెరువు కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లిన వలస కూలీ ప్రమాదవశాత్తు రైలు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటనతో ఆ కటుంబంలోనే కాకుండా గ్రామం లో విషాదం నెలకొంది. మండలం లోని ముస్లింపాళెంకు చెందిన ఎస్ఎం.సాహిల్ అలీ(42) కోయం బత్తూరు, కేరళకు వలస వెళ్లి కూలీ చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఉపాధి కోసం మంగళవారం రైలులో కోయంబత్తూరుకు బయలుదేరిన అతను మార్గమధ్యలో ఒక బోగి నుంచి మరో బోగికి మారే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు,కుమార్తె ఉన్నారు. అతడి మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

శ్మశాన వాటిక మార్గానికి ఎమ్మెల్సీ విరాళం



గ్రామస్థులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, ఫిబ్రవరి 21: మండలంలోని బండారుపల్లె పంచాయతీ శ్మశాన వాటికకు ఎన్న సంవత్సరాలుగా దారి లేక గ్రామప్రజలు నానా ఇబ్బందులు పడుతుండేవారు. సమస్య తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తన వంతు సాయంగా రూ.లక్ష శ్మశానానికి దారి ఏర్పాటుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ జనార్థన్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి మునికృష్ణారెడ్డి, నాయకులు రామిరెడ్డి, మునికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాక్షసపాలనను అంతం చేద్దాం: సుధీర్



చెల్లూరు అరుంధతివాడలో సుధీర్‌రెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

ఏర్పేడు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన జరుగుతోందని దానిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావలని టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం చెల్లూరు అరుంధతివాడ, పాయల్‌సెంటర్‌లో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, సీనియర్ నాయకులు ధనంజయులునాయుడు, కృష్ణయాదవ్, నాగరాజునాయుడు, సీతాపతి ఆచారి, చిరంజీవులునాయుడు, సుబ్రహ్మణ్యంతదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి యువత సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయాదవ్

రేణిగుంట,ఫిబ్రవరి21: రాష్ట్రంలో త్వరలో జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి యువకులు సైన్యంలా పనిచేయాలని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం తెలుగుయువత అధధ్యక్షుడు ఎ.కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. రేణిగుంట వైకన్వెక్షన్ హాలులో బుధవారం తెలుగు యువత సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన ముఖ్యఅతిదిగా పాల్గొని మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో అదికార వైసీపీ నాయకుల ఆగడాలను అరికట్టాలన్నారు. యువకులు టీడీపీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు. సమావేశంలో నాయకులు మహబూబ్ బాష, గజేంద్రరెడ్డి, బాలాజీ,కిరణ్ సహా అదిక సంఖ్యలో యువకులు పాలొన్నారు.

ఎమ్మెల్యే కుమార్తె ఎన్నికల ప్రచారం

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: ఎమెల్యే మదుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి బుధవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని కమ్ముకొత్తూరు, పెన్నలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగుకాల్వల నిర్మాణానికి చొరవ చూపండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 21: మండల కేంద్రంలోని శాటిలైట్‌కాలనీ, హరిజనవాడలో మురుగుకాల్వల నిర్మాణానికి చొరవ చూపాలని ప్రజలు కోరారు. ఎంపీ గురుమూర్తి బుధవారం మండల పర్యటనలో భాగంగా ఆయనకు ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మురుగుకాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. పంచాయతీ నిధులు రూ.20లక్షలు, ఎంపీపీ నిధులు కొంత, ఎమ్మెల్యే నిధుల, ఎంపీ నిధులు కలిపి రూ.70లక్షలు మంజూరయ్యాయని, పనులు మొదలుపెడుతున్నామని ఎంపీపీ పద్మప్రియ భర్త దామోదర్‌రెడ్డి శంకుస్థాపన చేసినా, ఇంత వరకు పనులు జరగలేదని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కరిస్తేనే ఓట్లకు రావాలని తెలపగా, పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలని షికారీల వినతి

వసతులు కల్పించాలని షికారీలు ఎంపీ గురుమూర్తికి విన్నవించారు. ఎంపీ గురుమూర్తి బుధవారం వరదయ్యపాళె మండల పర్యటనకు వచ్చిన సందర్భంగా షికారీలు బీఎస్పీ మండలాధ్యక్షుడు శంకర్‌తోపాటు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నివసించే ప్రాంతంలో తాగునీరు, కరెంటు, కనీస వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

తెలుగు మన వారసత్వ సంపద



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు- నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 21: తెలుగు మన వారసత్వ సంపదని భవిష్యత్ తరానికి అందించాల్సిన బాధ్యత అందరిపైన ఉందని తెలుగు ఉపాధ్యాయుడు, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి తెలిపారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుచ్చినాయుడు కండ్రిగ, కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు పాఠశాల విద్యార్థులు తెలుగు కవుల వేషదారణ, తెలుగు తల్లి వేషదారణలో ఎంతోగానో ఆకట్టుకున్నాయి. బుచ్చినాయుడుకండ్రిగ విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, రూపేష్ కుమార్ తెలుగు బాషా పండితులు శ్రీనివాలసులు, శిరోమణి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 21: మండలంలోని కంచనపుత్తూరు సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లను గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు స్వప్న, చంద్రయ్యలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు


నందీశ్వరుడికి హారతి ఇస్తున్న ప్రధానార్చకుడు కార్తికేశన్ గురుక్కల్

వైభవంగా ప్రదోష పూజలు

నాగలాపురం, ఫిబ్రవరి 21: మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో బుధవారం ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధానార్చకుడు కార్తికేశన్ గురుక్కల్ అభిషేకాలు, దీపారాధన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతాభిషేకాలు, పుష్పాలంకరణ చేసి ధీప ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం మహా హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులు చేపట్టారు. ఉత్సవ మూర్తులైన వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబికా అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అలంకరించి ఆలయంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ ఏ.వి.ఎం. బాలాజీరెడ్డి నేతృత్వంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో ప్రదోష నంది సేవ వేడుకగా జరిగింది. బుధవారం త్రయోదశి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామివారి సన్నిధి ఎదురుగా ధ్వజస్తంభం వద్ద ప్రదోష నంది వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువు తీర్చి అలంకరించారు. అర్చకులు హారతులు సమర్పించగా, ప్రదోష నందిపై ఆశీనులైన స్వామి వారికి ప్రాకారోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి


మైనారిటీ నాయకులతో సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: మైనారిటీలు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరులో మైనారిటీల ఆత్మీయ సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మైనారిటీలకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. .కార్యక్రమంలో మైనారిటీ నాయకులు షాకీరాలీ, బషీర్, మాబాషా, మీర్జా, షఫీ, జిలానీ, మస్తాన్, ఖాదర్‌బాషా, రఫీ, ముజీబ్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలలు ఆగండి మన ప్రభుత్వం వస్తుంది

● సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్


సూపర్ సిక్స్ కరపత్రాలతో నాయకులు

బుచ్చినాయుడు కండ్రిగ, ఫిబ్రవరి 21: రెండు నెలలు ఆగండి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని సత్యవేడు నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్ తెలిపారు. మండలంలోని మండలంలోని పల్లమాలకండ్రిగ, పచ్చలమ్మకాలనీ, తిమ్మాభూపాలపురం గ్రామాలలో బాబు షూరిటి భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటా ప్రచారం బుధవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, మేదర కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సుందరయ్య, నాయకులు వెంకటా చలం, మనోహర్‌నాయుడు, మునెయ్య, వీరరాఘవులు, శ్రీనివాసు లు, మధునాయుడు, దాము, హరినాథరెడ్డి, కృష్ణమూర్తి, సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అవకాశం ఇవ్వండి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించి అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని ఆపార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కుమ్మరి వీధిలో ఆ పార్టీ నాయకులు బుధవారం ఇంటింటికి ప్రచారం చేశారు. ఎత ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గరికిపాటి రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడు: ప్రదాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలే ఏపీలో బీజేపిని గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కో కన్వీనర్ మెళాగారం సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మండలంలోని పూడి గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, గోపాల్, గీత, చత్తమనాయుడు, మాదవనాయుడు, అమృతమ్మ, దొరబాబు నాయకులు పాల్గొన్నారు.

ఏర్పేడు: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఏర్పేడు మండలంలో ప్రచారం చేపట్టారు. ఏర్పేడు మండలంలో అంజిమేడు పంచాయతీ కృష్ణగిరి కాలనీలో బీజేపీ మండలాధ్యక్షుడు బాలాజీ రాయల్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. బీజేపీ నాయకులు నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెరకు తోట దగ్ధం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 21: మండలంలోని కీళపూడి పంచాయతీకి చెందిన తెన్నంపేటలో టి.బి.దొరవేలురెడ్డికి చెందిన 9 ఎకరాల చెరకు తోట బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. దీంతో ఆ రైతుకు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సచివాలయ సిబ్బందితో డీఎల్పీవో సమీక్ష

నాగలాపురం, ఫిబ్రవరి 21: మేజర్ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం శ్రీకాళహస్తి డివిజినల్ పంచాయతీ అధికారి ప్రభురెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్ళ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, పారిశుధ్యం, పంచాయతీలో తాగు నీటి సరఫరా, పీఎం విశ్వకర్మ వంటి అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, ఈవో పీఆర్డీ శైలేంద్ర, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, యుగంధర్, అబ్దుల్‌హాక్, నటరాజ్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

రేణిగుంట,ఫిబ్రవరి21: స్థానిక బజారువీధిలో బుధవారం ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ మల్లికార్జున్ తెలిపారు. వివరాలిలా.. ఏడాదిన్నర క్రితం జీవరత్నం(20),దుర్గాప్రసాద్‌లకు వివాహం జరగగా, వీరికి ఐదునెలల పాప ఉంది. కాన్పుకోసం జీవరత్నం బజారువీధిలోని కన్నవారింటికి వచ్చినప్పటినుంచి దుర్గాప్రసాద్ భార్యతో సఖ్యతగా ఉండకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడంతో జీవరత్నం క్షణికావేశంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొందని ఆయన తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు పోస్టుమార్టంకు తరలించామని, ఎస్‌ఐ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

తంగేళ్లపాళెంలో....

తొట్టంబేడు: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తంగేళ్లపాళెంలో చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర కథనం మేరకు తంగేళ్లపాళెంకి చెందిన వెంకటరత్తమ్మ కుమార్తె హేమావతి(22)కి రైల్వేకోడూరు, చిట్వేలుమండలం, కెఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన ప్రతాప్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఇటీవల హేమావతికి అబార్షన్ అయ్యింది. అప్పటి నుంచి ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో బుధవారం ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసేకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

మండలంలో 50 పోలింగ్ కేంద్రాలు

సత్యవేడు, ఫిబ్రవరి 21: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రామాంజనేయులు బుధవారం పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తహసీల్దార్ పోలింగ్ కేంద్రాల సౌకర్యాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.. ఈ క్రమంలో మండలంలోని కాలమనాయుడు పేట, కొత్తమారి కుప్పం, పెద్ద ఈటిపాకం, వానెల్లూరు, కొల్లడం, రాజగోపాల పురం, ఇరుగుళం తదితర పోలింగ్‌కేంద్రాలను సందర్శించి అక్కడ సౌకర్యాలపై ఆరా తీశారు. మండలంలో 50 పోలింగ్‌కేంద్రాలున్నట్టు ఆయన పేర్కొన్నారు. తహసీల్దార్‌తో పాటు బీఎల్వోలు రాజశేఖర్, శామ్యూల్ దేవ్, సుధాకర్, అలిమేలు, మహేష్, వీఆర్వో రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతానికి ఆవు మృతి



సత్యవేడు, ఫిబ్రవరి 21: విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన సంఘటన సత్యవేడు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని అంబాకం గ్రామంలో చెందిన శంకర్‌కు చెందిన పాడి జెర్సీ ఆవును మేత కోసం పొలాల వద్దకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆవు మేత మేస్తూ విద్యుత్ స్తంభానికి రాసుకోగా షాక్‌కు గురైంది. దీంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. జెర్సీ ఆవు దాదాపు 60 వేలు విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపాడు.

'గంగ' అందించి పంటలను కాపాడండి


నీటి సమస్యను ఎంపీకి వివరిస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 21: మండలంలో చెరువుల్లో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయని తెలుగుగంగ నీరు విడుదల చేసి కాపాడాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తికి కాంపాళెం, నీర్పాకోట, కుక్కంబాకం బుధవారం రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువుల్లో నీరు పూర్తిగా ఎండిపోయి ప్రస్తుతం చేతికి అందే వరి పంటలు ఎండిపోయే స్థితికి వచ్చాయని ఈ మూడు గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాల్లో వరి ఎండిపోతోందని చెప్పారు. వ్యవసాయానికి కరెంటు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో మోటర్ల దగ్గర ఎదురు చూస్తున్నమని తెలపారు. దీనిపై స్పందించిన ఎంపీ తెలుగుగంగ సీఈతో మాట్లాడి నీరు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. రైతులకు విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటిని ఆదేశించారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజక వర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్, జిల్లా కార్మిక విభాగ అధ్యక్షుడు బీరేంద్రవర్మ, సత్యవడే నియోజక వర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి గురువయ్య, గిరి, గురున్నాథం తదితరులు పాల్గొన్నారు

మద్యం బాటిళ్లు స్వాధీనం: ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఫిబ్రవరి 21: మండలంలోని శివనాథపురం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మునిరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర తెలిపారు.

మహాశివరాత్రి పత్రికల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన, గోడపత్రికల ఆవిష్కరణ బుధవారం జరిగింది. ఆహ్వాన, గోడపత్రికలను ఆలయంలోని గురుదక్షిణామూర్తి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు. అనంతరం మేథో దక్షిణామూర్తి సన్నిధిలో లాంఛనంగా ఆవిష్కరించి ఆహ్వాన పత్రికలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి అతని ఇండికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, వేద పండితులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై కసరత్తు

ముక్కంటి ఆలయంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై బుధవారం అధికారులు కసరత్తు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు ఆలయ నాలుగు ప్రవేశ ద్వారాల వద్ద క్యూలైన్ల ఏర్పాట్లు పై చర్చించారు. ఈ సంవత్సరం రెండవ గోపురం నుంచి సర్వదర్శనం భక్తులను, అలాగే మూడో గోపురం నుంచి రూ.200, రూ.500 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులను అనుమతిస్తామని తెలిపారు. ప్రోటోకాల్ వీఐపీల కోసం నాలుగో గోపురం నుంచి క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భరద్వాజ తీర్థం వద్ద వీఐపీ వాహనాల పార్కింగ్ ఏరాటుకు చర్చించారు. కార్యక్రమంలో ఈఈ నూకరత్నమ్మ, ఏఈఓ ధనపాల్, అధికారులు నాగభూషణం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మేథో దక్షిణామూర్తి సన్నిధిలో ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న చైర్మన్, ఈవో తదితరులు

మార్పును కర్తవ్యంగా మార్చేదే రెడ్ బుక్ డే


మాట్లాడుతున్న షరీఫ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: మార్పును కర్తవ్యంగా మార్చేదే రెడ్ బుక్ డే అని సీపీఎం సీనియర్ నేత, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఎస్ఎం షరీఫ్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో బుధవారం రెడ్ బుక్ డే నిర్వహించి, ఆవశ్యకతను కార్యకర్తలకు వివరించారు. రెడ్ బుక్ డే ఆశయాలను ప్రజాక్షేత్రంలోకి ఎలా తీసుకెళ్లాలో సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు హరినాథ్, నాయకులు వెంకటరమణ, గంధం మణి, గురవయ్య, రాజా, చందన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుప మెట్ల ఏర్పాటుపై అభ్యంతరం


తిరుమంజన గోపురం మార్గంలో ఇనుప మెట్ల ఏర్పాటు

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 21: ముక్కంటి ఆలయంలో ఇనుపమెట్ల ఏర్పాటు పై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ముక్కంటి ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలున్నాయి. ప్రతి ద్వారానికి ఒక్కో వైశిష్ట్యాన్ని పురాణాల్లో పేర్కొన్నారు. ఆగమ నియమం ప్రకారం నాలుగు ద్వారాలను గోపురాలు నుంచి రాతి మెట్ల మార్గాలను నిర్మించారు. మూడో ద్వారం తిరుమంజన గోపురం నుంచి భక్తులు రాకపోకలు సాగించేవారు. అయితే ఈ మార్గంలో ఎత్తైన రాతి మెట్లు ఉన్నాయి. వీటిని భక్తులకు అనువుగా మారుస్తున్నామంటూ ఇనుపమెట్లను ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఇది శాస్త్ర విరుద్ధమంటూ సామాజిక మాధ్యమాల్లో భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీనిపై ఆలయ అధికారులను వివరణ కోరగా... ఇది చాలా విశేషమైన కామ్య మార్గంగా భక్తులు ఆరాధిస్తుంటారని... వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు సైతం ఈ మార్గం నుంచి ఆలయంలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలి


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న స్వచ్ఛభారత్ వర్కర్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: స్వచ్ఛభారత్ కార్మికులకు 24 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ఏఐటీయూసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ... గ్రామాల్లో స్వచ్ఛభారత్ వర్కర్లు నిరంతరాయంగా పనిచేస్తున్నా, వారికి 24 నెలలుగా వారికి జీతాలు ఇవ్వకుండా శ్రామికులను వేధించడం అమానుషమన్నారు. జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేయడమే కాకుండా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు, వాలంటీర్లు వేధిస్తున్నారని వాపోయారు. స్వచ్ఛభారత్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ... పదివేల రూపాయల కనీస వేతనం ఇస్తానని ప్రభుత్వం ప్రకటించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న అమలకు నోచుకోలేదన్నారు. యూనియన్ జిల్లా కన్వీనర్ అన్నాదొరై రామయ్య, సభ్యులు ఆనందయ్య, సింగయ్య, జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి అదనపు బస్టాండ్ నిర్మించండి


హరిని సత్కరిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: ప్రముఖ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో అదనపు ఆర్టీసీ బస్టాండ్ ను నిర్మించాలని వైస్ ఛైర్మన్ మిద్దెల హరి కోరారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన మిద్దెల హరిని ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బుధవారం ఆయన విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో వైస్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఆర్టీసీ బోర్డు సమావేశంలో తిరుపతిలో అదనపు ఆర్టీసీ బస్టాండ్ అవసరాన్ని వివరించారు. అలాగే మరో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఆధ్యాత్మిక శోభ చేకూరేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఆయనను ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, సభ్యులు ఘనంగా సత్కరించారు.

చాముండేశ్వరి ఆలయానికి నూతన పాలకవర్గం


ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తి పట్టణం భాస్కర పేట లోని చాముండేశ్వరి ఆలయం నూతన పాలకవర్గం ఎన్నిక జరిగింది. ఇందులో భాగంగా బుధవారం ఆలయంలో కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కొత్త కార్యవర్గం అధ్యక్షుడిగా చల్ల జయరామయ్య, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, ఈశ్వరయ్య, కన్నా వెంకటేశ్వర్లు తదితర సభ్యులతో కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జయరామయ్య మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

వ్యక్తిత్వ వికాసంతోనే ఉన్నతమైన జీవితం


విద్యార్థులు, సిబ్బందితో ఆచార్య అజిత్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: మార్కులు, ర్యాంకులతో ఉద్యోగాలు మాత్రమే వస్తాయని.. వ్యక్తిత్వ వికాసంతో తప్పక ఉన్నత జీవితం సిద్ధిస్తుందని ఇండియా ఆన్ ది మూన్ ఫౌండేషన్ ఛైర్మన్ ఆచార్య అజిత్ తెలిపారు. ఉషోదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాలు ఉషా ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని గురుకుల పాఠశాల, ఎంజీఎం పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య అజిత్ వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మునిరత్నం నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్‌ను వెంటాడుతున్న స్థానికేతర వివాదం

● నాన్‌లోకల్‌గా చూడొద్దు ప్లీజ్ అంటూ విన్నపం

సత్యవేడు, ఫిబ్రవరి 21: నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు స్థానికేతర వివాదం వెంటాడుతూనే ఉంది. గతనెల 31వ తేదీన రాజేష్‌ను సత్యవేడు అభ్యర్థిగా ఖరారు చేస్తూ ఆపార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. రాజేష్ అభ్యర్థిత్వాన్ని సొంత పార్టీ నేతలు కొందరు పరోక్షంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెరమీదకొచ్చిన స్థానిక నినాదంతో ఆ పార్టీలోని ఎస్సీ సామాజిక వర్గ నేతలు పలువురు స్థానికులైన తమకే టికెట్ కావాలంటూ పట్టుబడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నియోజకవర్గంలోని వరదయ్యపాళెంలో జరిగిన వలంటీర్ల సన్మానం కార్యక్రమానికి ఎంపీ గురుమూర్తితో పాటు వైసీపీ అభ్యర్థి రాజేష్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు పార్టీ నేతలు తమ ప్రసంగంలో స్థానికేతర అంశాన్ని ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన రాజేష్ తాను నాన్ లోకల్‌గా చూడొద్దని, లోకల్‌గానే గుర్తించాలని కోరారు.

ప్రచార కార్యక్రమంలా వలంటీర్ల సన్మానం

వరదయ్యపాళెం మండలంలో బుధవారం ప్రభుత్వం నిర్వహించిన వలంటీర్ల సన్మానం వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలా మారింది. కార్యక్రమానికి ఎంపీడీవో అధ్యక్షత వహించాల్సి ఉండగా అతడిని ఓ మూలన కూర్చొబెట్టి కార్యక్రమం మొత్తం ఎంపీపీ భర్త దామోదర్ నడిపించడం విశేషం. కాగా మండలంలో 249 మంది వలటీర్లు ఉండగా కార్యక్రమానికి 90 మంది దుమ్మాకొట్టడం గమనార్హం

వెనుక వరుసలో గిరిజన ప్రజా ప్రతినిధులు

కార్యక్రమంలో అధికార పార్టీ నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించి, ప్రోటోకాల్‌ను సైతం పట్టించుకోలేదు. ఎంపీతో పాటు వేదికపై ముందు వరుసలో కూర్చునేందుకు ప్రధాన సామాజికవర్గం నేతలు పోటీపడి, వరదయ్యపాళెం పంచాయతీ ప్రథమ మహిళ (సర్పంచ్) జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లుకు వేదికపై వెనుక వరుసలో కూర్చొబెట్టడం విమర్శలు చెలరేగాయి. సర్పంచ్ జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు ఇద్దరూ గిరిజన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతోనే ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇవ్వడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు ఎంపీ పాల్గొన్న కార్యక్రమంలోనే ఈ సంఘటన జరగడం గమనార్హం

వైసీపీ ఆత్మీయ సమావేశంలో నిరసన గళం

● నేతల తీరుపై ఎంపీకి ఎస్సీ, బీసీ నేతల ఫిర్యాదు

వరదయ్యపాళెంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ మండల అగ్రనేతల తీరుపై ఎస్సీ, బీసీ నేతలు నిరసన గళం వినిపించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వలంటీర్ల సన్మాన కార్యక్రమం అనంతరం ఎంపీపీ చాంబర్‌లో ఎంపీ గురుమూర్తి ఆధ్వర్యంలో నూకతోటి రాజేష్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎస్సీ, బీసీ నేతలు మండల నేతల తీరును తూర్పారబట్టారు. తమ సామాజిక వర్గాల వారికి పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత లేదని, కేవలం తమను పల్లకి మోసే బోయిలుగానే చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారిపాకం ఎంపీటీసీ మధుసూదన రావు మాట్లాడుతూ ఒక ప్రజా ప్రతినిధిగా తాను ఏ కార్యాయాలకు వెళ్ళినా, కనీసం పోలీస్ స్టేషన్‌కు వెళ్ళినా తన మాటకు విలువనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల నాయకులు సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ మండలంలో దళితులను వైసీపీకి ఓటు బ్యాంకుగానే చూస్తూ, పదవుల్లో మాత్రం మొండిచేయి చూపించి, ఉన్నత వర్గాలకు కట్టబెడుతున్నారని గోడు వెళ్లబోసుకున్నారు. ఎంపీ గురుమూర్తి కలుగ జేసుకుని ఇది పరిచయ కార్యక్రమం మాత్రమేనని, ఇక్కడ సమస్యలు వద్దని, వేరే వేదికపై చర్చించి అందరికీ న్యాయం చేస్తామని సర్దిచెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ - వెనుక వరుసలో కూర్చొన్న సర్పంచ్ జ్యోతి, జడ్పీటీసీ వెంకటేశ్వర్లు

అన్నదానానికి రూ.50వేల విరాళం


ఆలయ చైర్మన్‌కు విరాళం అందజేస్తున్న నటరాజన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం పథకానికి తిరుపతికి చెందిన నటరాజు అనే భక్తుడు రూ. 50,501 విరాళంగా సమర్పించారు. ముక్కంటి ఆలయానికి బుధవారం కుటుంబ సమేతంగా వచ్చిన దాత ఆలయ పరిపాలన భవనంలో చైర్మన్ అంజూరు శ్రీనివాసులును కలిసి విరాళం అందజేశారు. దాత కుటుంబానికి అభినందనలు తెలిపి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.